బైక్‌ల టైర్లు, స్పేర్‌పార్ట్స్ చోరీ

అయిజలో చోరీకి గురైన ద్విచక్రవాహన టైర్లు

అయిజ, ఏప్రిల్ 6 : పట్టణంలో గుర్తు తెలియని దుండగులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. వారం కిందటే పట్టణంలోని ఓ పెట్రోల్ పంపులోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేసి, సిబ్బందిని మారణాయుధాలతో భయభ్రాంతులకు గురి చేసి నగదును ఎత్తుకెళ్లిన ఘటన చోటుచేసుకున్నది. శనివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనాల మరమ్మతులు చేసే మెకానిక్‌ల వారి షెడ్లలో నిలిపి వాహనాల టైర్లు, స్పేర్ పార్ట్స్ చోరీ చేసినట్లు మెకానిక్‌లు తెలిపారు. మరమ్మతులకని వాహనదారుడు మెకానిక్‌ల దగ్గర నిలిపిన వాహనాల టైర్లు చోరీ చేయడంతో వాహనదారుడు ఆ బాధ్యత తమపై నెట్టడంతో కొత్త టైర్లు, స్పేర్ పార్ట్స్ వేయాలని వాహనదారుడు ఒత్తిడి చేస్తుండటంతో ఎంతో నష్టపోతామని వాహన మెకానిక్‌లు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ఇండ్ల ఎదుట వాహనాలు నిలిపితే తెల్లారే వరకు ఉంటుందో, పోతుందోనని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ మమ్మరం చేయాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

ఈడిగోనిపల్లిలో కబడ్డీ పోటీల్లో పాల్గొన్న కబడ్డీ క్రీడాకారులు

అయిజ రూరల్, ఏప్రిల్ 6 : క్రీడలతో స్నేహ భావం పెంపొందుతుందని అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, మాజీ ఎంపీటీసీ లక్ష్మీకాంతారావు అన్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని ఈడిగోనిపల్లిలో అంతర్‌రాష్ట్ర మహిళా కబడ్డీ పోటీలను ఆదివారం ప్రారంభించారు. కబడ్డీ పోటీలకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతారావు, బడేసాబ్ యాదవ్, వెంకన్నయాదవ్, సురేశ్ గౌడ్, నాగేశ్‌యాదవ్, వెంకటేశ్, నర్సింహులు, దేవరాజు, శివన్న పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మల్దకల్, ఏప్రిల్ 6 : గ్రామాల్లో యువత చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం ఉండాలని, అలాగే మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బిజ్వారంలో ఈనెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా వైవీఆర్ గ్రౌండ్‌లో ఓపెన్‌క్రికెట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి వారు పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సమానంగా చూడాలని క్రీడాకారులకు సూచించారు. గెలిచినా, ఓడిన పట్టించుకోవద్దన్నారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

బీటీ రణధీవే ఆశయాలను సాధిద్దాం

బీటీ రణధీవే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయు నాయకులు

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 6 : కార్మికుల హక్కుల కోసం పోరాడిన బీటీ రణధీవే ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని సీఐటీయూ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బీటీ రణధీవే 35వ వర్ధంతి సందర్భంగా ఉండవల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జానీ, వెంకటేశ్, శ్రీనివాసులు, శ్రీను, శేఖర్‌రెడ్డి, సుబ్బారాయుడు, మద్దిలేటి, నూర్ అహ్మద్, నబీబాష తదితరులు పాల్గొన్నారు.

నాగులకుంటవాగు బ్రిడ్జి పూర్తిచేయాలి

పాన్‌గల్, ఏప్రిల్ 6 : మండలంలోని కేతేపల్లి పరిధిలోని నాగులకుంటవాగు బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లాకార్యదర్శి వర్గస భ్యుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన బ్రిడ్జిని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్‌అండ్‌బీ శాఖ రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తోందని, పని మొదలై నాల్గేండ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు పూర్తికాలేదని తెలిపారు. వానాకాలంలో నాగులకుంటవాగు వస్తే బస్సుల రాక పోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. బ్రిడ్జినిర్మాణం పూర్తి చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

తిమ్మాపూర్‌లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 6 : మండలంలోని తిమ్మాపూర్‌లో ఆదివారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, అంబేద్కర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. అనంతరం వారు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీలు నర్సింహులు, నగేశ్, మాజీసర్పంచ్ శివుడు, రాంచంద్రారెడ్డి, శంకరాయుడు, రవి, సాయిబాబ, రాముడు, సత్యం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

అర్జెంటుగా కావలెను
★అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వసతి సౌకర్యం కలదు. మంచి జీతం కలదు. సంప్రదించండి: 9392663777, 9246663777.
NT-329238

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748



గద్వాల కోటలో సీతారామా కల్యాణానికి హాజరైన భక్తులు

గోపాల్‌పేటలో సీతారామకల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

కల్యాణం.. రమణీయం

మార్మోగిన శ్రీసీతారామ జపం.. మురిసిన భక్తజనం

గద్వాల/మల్దకల్/ధరూర్/గట్టు/ గోపాల్‌పేట/అమరచింత/మదనాపురం/పెబ్బేరు/వీపనగండ్ల/అలంపూర్‌చౌరస్తా/అయిజ/అయిజ రూరల్, వడ్డేపల్లి/మానవపాడు/రేవల్లి/కొత్తకోట/ఏప్రిల్ 6 : జిల్లాలో సీతారాముల కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణలు, భక్తుల రామనామస్మరణలు, మేళతాళాల చప్పుళ్ల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆదివారం గద్వాలకోటలోని శ్రీరామాలయంతో పాటు ఆయా మండలాల పరిధిలోని కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మల్దకల్ మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శ్రీరామనవమి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధరూర్ మండలంలో కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. గట్టు మండలకేంద్రంతోపాటు పెంచికలపాడు, బోయలగూడెం, తుమ్మలచెర్వులో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు పాల్గొని కల్యాణం నిర్వహించారు. గోపాల్‌పేటలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, బుద్దారంలో ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అమరచింత మండలంలో ఆత్మకూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో కల్యాణం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆత్మకూర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్రబాలల హక్కుల కమిషన్ చైర్మన్ సీతాదయాకర్‌రెడ్డి తలంబ్రాలను పంపించారు. మదనాపురం మండలంలో ఆలయాల్లో కల్యాణాన్ని భక్తులు జరిపించారు. పెబ్బేరు మండలంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. వీపనగండ్ల మండలంలో శ్రీరామనమిని నిర్వహించారు. ఉండవల్లి మండలంలోని ఊరూరా శ్రీరామనవమి ప్రజలు జరుపుకొన్నారు. అయిజలోపట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించారు. వడ్డేపల్లి మండలకేంద్రంలోని శాంతినగర్‌లోని సీతారామాలయంలో కల్యాణం చేపట్టారు. మానవపాడు మండలంలో ఆయా గ్రామాల్లో రాములోరి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. రేవల్లి మండలంలో శ్రీరామనవమిని ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు.. కొత్తకోటలో మండలంలోని సీతారాముల కళ్యాణ మహోత్సవం ఎంతో భక్తి శ్రద్ధలతో జరిగింది. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్‌లు పాల్గొన్నారు.



వనపర్తిలో మాజీ మంత్రిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

శాంతినగర్ రామాలయంలో కల్యాణానికి హాజరైన అశేష భక్త జనం

తుమ్మలచెర్వులో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు

గట్టులో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మల్దకల్: తాటికుంటలో కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

కలుకుంట్లలో స్వచ్ఛభారత్

మానవపాడు, ఏప్రిల్ 6 : ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కలుకుంట్లలో ఆదివారం మూడో రోజు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మండలంలోని కలుకుంట్లలో శాంతినగర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. సబ్‌స్టేషన్, గ్రామంలోని వీధుల్లో చెత్తాచెదారం శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తిమ్మప్ప స్వామికి బంగారు నామం వితరణ

మల్దకల్, ఏప్రిల్ 6 ; ఆదిశిలా క్షేత్రంలో వెలసిన స్వయంభు లక్ష్మీవేంకటేశ్వరస్వామికి కర్నూల్‌జిల్లా మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన కురువ సుజాత జయరాములు దంపతులు స్వామి వారికి 4 గ్రాములు బంగారు నామంను వితరణ చేశారు. వీటిని అర్చకుడు రవిచారి స్వామి వారి చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం వీటిని ఆలయాధికారులకు అందజేశారు. దాతలను అర్చకుడు శేష వస్త్రంతో సత్కరించారు.

ఆస్తిపన్నుపై 5శాతం రాయితీ

- ఈ నెల 30వరకు గడువు
- పన్నులు బకాయి లేని వారు అర్హులు

గద్వాల టౌన్, ఏప్రిల్ 6 : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మున్సిపాలిటీ పన్నుల చెల్లింపులో 5 శాతం రాయితీని ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇందుకు ఈ నెల 30 వరకు గడువు విధించింది. ఈ లోపు పన్నులు చెల్లించిన వారికి మాత్రమే పన్ను మొత్తంలో 5 శాతం రాయితి వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రశాఖ ఆయా మున్సిపాలిటీకు ఉత్తర్వులు జారీ చేసింది.

గద్వాల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 16,317 నివాస గృహాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. నివాస గృహాల నుంచి ప్రతిఆర్థిక సంవత్సరం ముగింపు వరకు రూ.9కోట్ల45 లక్షల పన్నుల రూపంలో వసూళ్లు చేయాల్సి ఉంది. అయితే ప్రతి ఏడాది అనుకున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు మున్సిపాలిటీ అధికారులు అపసోపాలు పడుతుంటారు. గడువు లోగా చెల్లించని వారికి పెనాల్టీలు విధించడం వంటిది జరుగుతూ వస్తుంది. దీంతో ప్రజలకు అధిక భారం పడుతుంది. ప్రజలమీద అధికభారం పడకుండా పెనాల్టీతో పాటు అసలులో కూడా ఆదాఅయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు ఆర్థికసంవత్సరం మొదటినెలలోనే పన్నులను చెల్లించిన వారికి రాయితీని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ముందస్తు చెల్లిస్తే లాభం...

కనీస పన్ను వెయ్యి ఉన్న వారికి అపరాధ రుసుంతో రూ.1250 నుంచి రూ.1300వరకు చెల్లించాల్సి ఉంటుంది. అదే ముందస్తుగా చెల్లిస్తే రాయితీరూపంలో రూ.300వరకు ఆదాఅయ్యే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయాన్ని మున్సిపాలిటీ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రతిఏడాది పన్నులను సక్రమంగా చెల్లించిన వారే రాయితీ పొందేందుకు అర్హులు. గతంలో మున్సిపాలిటీకి బకాయి పడ్డ వారికి రాయితీ పథకం వర్తించదని అధికారులు చెబుతున్నారు. అయితే పాత బకాయిలు చెల్లించి ఈ ఆర్థిక సంవత్సరం పన్ను చెల్లిస్తే రాయితికి అర్హులవుతారు.

దాదాపు పది వేల గృహాలకు అర్హత :

మున్సిపాలిటీ పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 16,317 గృహాలు ఉన్నాయి. వాటిలో 9,982వేల గృహాలు 5శాతం రాయితీ పొందేందుకు అర్హత సాధించాయి. అర్హులైన గృహాల వారు ముందస్తుగాపన్నులు చెల్లిస్తే రూ.3.38 కోట్ల ఆదాయం మున్సిపాలిటీ సమకూరే అవకాశం ఉంది. అర్హులైన గృహాలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దశరథ్ కోరారు. రాయితిపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30వరకు గడువు ఉందని కాబట్టి ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

గద్వాల మున్సిపాలిటీ కార్యాలయం

రోడ్డుమీదనే వ్యాపారాలు..!

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- చూసీ చూడనట్లుగా అధికారులు
- ప్రమాదాల బారిన వాహనదారులు

తాయమ్మ ఆలయం పక్కన రోడ్డుపై ఏర్పాటు చేసిన కూరగాయల అంగడి

గద్వాల టౌన్, ఏప్రిల్ 6 : జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా వ్యాపారస్థులు ఇష్టానుసారంగా తమ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. దుకాణాలను కాదని రోడ్ల మీదకు వస్తున్నారు. వారు విక్రయించే వస్తువులను రోడ్ల మీద పెట్టేస్తున్నారు. కొందరేమో రోడ్డు చివరివరకు షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. మరోపక్క ఇష్టానుసారంగా ప్రచార బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాక దుకాణాల ఎదుట వాహనాలను నిలిపేందుకు స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. అలాగే కొనుగోలు దారులు సైతం రోడ్డు మీద నిలబడే కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలకు గురువుతున్నారు. అంబేద్కర్ చౌరస్తా, థియేటర్ల ఎదుట, రాజీవ్‌మార్గ్, కృష్ణవేణి చౌరస్తా, మెయిన్‌బజార్‌లో సమస్యను ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

రోడ్డు ఆక్రమణలు.. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం మానేశారు. రోడ్డు మీద వాహనాలు నిలిపితే ఫైన్ వేయడమే తమ బాధ్యతని.. ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న వ్యాపారస్థులపై చర్యలు తీసుకోవడం మా బాధ్యత కాదన్నట్లుగా ట్రాఫిక్ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇరు శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వనపర్తి టౌన్, ఏప్రిల్ 6 : జిల్లా కేంద్రంలోని బాలానగర్‌లో ఉన్న 33/11 కేవీ ఉపకేంద్రంలో 11 కేవీ స్విచ్చుల మరమ్మతు చేయడం జరుగుతుందని ఏఈ రాజయ్య గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కావున 11 కేవీ రాజపేట, చిన్నగుంటపల్లి, గోపాల్‌పేట, వనపర్తి టౌన్1, టౌన్2 ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన చెప్పారు. కావున వనపర్తి, చిట్యాల , చిన్నగుంటపల్లి, రాజపేట, రాజనగరం, అచ్యుతాపురం, నర్సింగాయపల్లి, జగత్‌పల్లి గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ, గృహ, వ్యాపార, పరిశ్రమల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అరవింద్ జ్ఞాపకాలు మరువలేనివి

ఆడియో, వీడియోను ఆవిష్కరిస్తున్న మాజీఎంపీపీ

అమరచింత, ఏప్రిల్ 6 : విద్యార్థి అరవింద్ జ్ఞాపకాలను మరువలేనివని మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం అరవింద్ జ్ఞాపకర్థం ప్రముఖ గాయని శ్యామల రచించి రూపొందించిన ఆడియో, వీడియోను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, గాయని శ్యామల, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సురేశ్, ప్రమీల, శ్యాంసుందర్, రాజు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ

గద్వాల రూరల్, ఏప్రిల్ 6 : మండలంలోని తుర్కోనిపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి నూతన విగ్రహ ఏర్పాటు ఆవిష్కరణ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి రాజీవంశీయులు డాక్టర్ సుహాసినిరెడ్డి, విక్రమ సింహారెడ్డి పాల్గొని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గీత వెంకటయతి నాయుడు, మధుసూదన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పశుబల ప్రదర్శన పోటీలు ప్రారంభం

పశుబల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు, ఏప్రిల్ 6 : మండలంలోని శాఖాపురంలో ఏర్పాటు చేసిన పశుబల ప్రదర్శన పోటీలను వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. రైతులను, పశుపోషకులను ప్రోత్సహించేందుకు పోటీలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. గెలుపు ఓటములు సహజమని, వాటిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పశు పోషకులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మృతురాలు కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

గోపాల్‌పేట, ఏప్రిల్ 6 : మండల కేంద్రానికి చెందిన బాలమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం మృతురాలు కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. బీఆర్ఎస్ మండల మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు కర్రోళ్ల స్వప్న రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుండ్రాతి రాజేశ్‌గౌడ్ నాయకులు భాస్కర్, రాజు, కురుమయ్య, రమేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.